సంక్షేమమేదీ..?


అడవిని తలపిస్తున్న ప్రాంగణం


పొదలకూరు రోడ్డులోని గిరిజన బాలికల హాస్టల్లో ఇలా..


భోజన గదిలో నిద్రిస్తున్న శునకం

- దుర్భరంగా ప్రభుత్వ వసతిగృహాలు
- కనీస వసతులూ కరువే
- కొరవడిన పర్యవేక్షణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాలు దుర్భర స్థితికి చేరుకున్నాయి. ఇక్కడ కనీస వసతులు కరువవడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతమవుతున్నాయి. హాస్టళ్లు బాగున్నాయంటూ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందే తప్ప, దానిపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. గతేడాదికి సంబంధించిన డైట్, కాస్మొటిక్ బిల్లులను సక్రమంగా ఇవ్వకపోవడంపై వార్డెన్లే ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి దాపురించిందని పలువురు ఆరోపిస్తున్నారు.

నగరంలో ఇలా..

నగరంలో ఐదు బీసీ, పది ఎస్సీ, రెండు ఎస్టీ హాస్టళ్లతో పాటు రెండు ఎస్టీ గురుకులాలున్నాయి. ఇందులో దాదాపు రెండు వేల మంది విద్యార్థులున్నారు. ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో పెట్టెలు, చాపలు, దుప్పట్లను నేటికీ ఇవ్వలేదు. రాత్రి వేళ నేలపైనే నిద్రించాల్సి వస్తోంది. కిటికీలు తెరిస్తే దోమలు, పురుగులతో నానా ఇబ్బంది పడుతున్నారు. ఎస్సీ హాస్టల్లో వేసవిలో మరమ్మతులు చేసినా, ఎలాంటి ప్రయోజనం లేదు.


కొండాయపాళెం గేట్ సమీపంలోని ఎస్సీ డిగ్రీ కళాశాల హాస్టల్లో అధ్వానంగా వాష్ రూమ్

మురికికూపం

నగరంలోని హాస్టళ్లను పర్యవేక్షించాల్సిన ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయమే చెత్తా చెదారంతో నిండి దర్శనమిస్తోంది. కొండాయపాళెం గేట్ వద్ద గల పాత హాస్టల్ భవనంలో ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కాంపౌండ్ లోపల చెట్లు పెరిగాయి. ఎస్సీ, బీసీ హాస్టళ్ల వార్డెన్ల మీటింగ్‌లు, విధులను ఇక్కడి నుంచే నిర్వహిస్తున్నారు. హాస్టళ్లతో పాటు కార్యాలయ భవనాలను నిర్మించాల్సిన అవసరం ఉంది.

అద్దె భవనంలోనే..

మూలాపేటలో ఇళ్ల మధ్యలో అద్దె భవనంలో ఉన్న హాస్టల్‌ను ఇంతవరకు మార్చలేదు. జెడ్పీ హైస్కూల్లోని హాస్టల్ నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించలేదు. నగరంలోనే ఇలా ఉన్నాయంటే, జిల్లాలో పరిస్థితి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

అన్నీ సమస్యలే..

- మద్రాస్ బస్టాండ్ వద్ద హాస్టల్ హబ్‌గా చెప్పుకొనే ఆరు ఎస్సీ వసతిగృహాల్లో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదులు అంతంతమాత్రంగా ఉన్నాయి.
- దర్గామిట్టలో మెయిన్ రోడ్డును ఆనుకొని భారీస్థాయిలో నిర్మించిన కాలేజీ హాస్టల్ పరిస్థితి అధ్వానంగా తయారైంది. హాస్టల్లో కిటికీల అద్దాలను పగలగొట్టేశారు. మరుగుదొడ్లు దుర్భరంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.
- దర్గామిట్ట జెడ్పీ హైస్కూల్లోని ఎస్టీ హాస్టల్, గిరిజన గురుకులంలో విద్యార్థులు నేలపై నిద్రిస్తూ దోమలతో సహవాసం చేస్తున్నారు.
- ప్రతి హాస్టల్లో పరిశుభ్రత దయనీయంగా మారింది. చెత్తనంతా మూలకు నెట్టేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ హాస్టళ్లు ప్రారంభమై నెలన్నరవుతున్నా, ఎక్కడా 20 నుంచి 30 మంది కూడా కొత్తగా చేరకపోవడం నిర్వహణ తీరును తెలియజేస్తోంది.

క్లుప్తంగా

నేటి నుంచి మహాకుంభాభిషేకాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో విమానగోపురం, నవగ్రహ మండప పునఃప్రతిష్ఠను పురస్కరించుకొని మహాకుంభాభిషేక మహోత్సవాలను సోమవారం నుంచి గురువారం వరకు నిర్వహించనున్నామని ఈఓ కోవూరు జనార్దన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను ఆదివారం విడుదల చేశారు.

ఎమ్మెల్సీకి అభినందనల వెల్లువ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని రామ్‌జీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో పలువురు ఆదివారం కలిసి అభినందనలను తెలియజేశారు. పార్టీ తొమ్మిదో డివిజన్ నేత ధనుజారెడ్డి, నేతలు.. మూడో డివిజన్‌కు చెందిన పార్టీ శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
- పర్వతరెడ్డిని పార్టీ 42వ డివిజన్ కో ఆర్డినేటర్ అబ్దుల్ మస్తాన్ తదితరులు సత్కరించారు.

బాలలకు పుస్తక పరిచయం



నెల్లూరు(బృందావనం): అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ఎన్టీఆర్ పార్కులో పుస్తకం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రజాసైన్స్ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీనివాసులు, భక్తవత్సలనాయుడు, గోవిందరాజు సుభద్రాదేవి మాట్లాడారు. పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలను తెలిపారు. మొబైల్ ఫోన్ల నుంచి పిల్లలను దూరం చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించామని వివరించారు. అనంతరం పుస్తకాలను అందజేశారు.

వధూవరులకు ఆశీర్వాదం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కిసాన్‌నగర్‌లోని డీజీపీ కల్యాణ మండపంలో ఆదాల ప్రభాకర్ రెడ్డి కార్యాలయ సిబ్బంది సురేష్ కుమార్తె సువర్ణ భవిత వివాహ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

కొడవలూరు: స్మార్ట్ మీటర్లను ప్రజలంతా ఐక్యంగా వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ కోరారు. మండలంలోని నార్తురాజుపాళెం ఏఎంసీ ప్రాంగణంలో ఆ పార్టీ మండల మూడో మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై భారం పడుతోందన్నారు. నెల్లూరు నగరంలోని ఓ పిండిమిల్లుకు నెలకు రూ.6 వేలు కరెంటు బిల్లు వస్తుండగా స్మార్ట్‌మీటర్ బిగించాక రూ.20 వేల బిల్లు వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులు పెంచమని చెప్పి స్మార్ట్ మీటర్ల రూపంలో ప్రజలపై పెనుభారం మోపుతోందన్నారు. ఇండోసోల్ పరిశ్రమకు 8,400 ఎకరాల భూమి అప్పజెప్పేందుకు కూటమి ప్రభుత్వం జీఓ తెచ్చిందని, దీనిపై సేవ్ కరేడు పేరుతో ఆందోళన చేపడితే దానిని అణచి వేసేందుకు స్థానిక ఎమ్మెల్యే యత్నిస్తుండడం దారుణమన్నారు. పోరాటం చేస్తున్న గిరిజనులు, సీపీఎం నాయకులపై కేసులు పెట్టించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. మండలంలోని యల్లాయపాళెంలో అత్యధికంగా వ్యవసాయ కార్మికులు ఉన్నారని, వీరు పనుల్లేక నెల్లూరు నగరానికి పనుల కోసం వెళ్తున్నారన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమలు స్థాపించి ఇక్కడి వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.గోపాల్, ఎం.పుల్లయ్య, జి.దయాకర్, డి.రామచంద్రయ్య పాల్గొన్నారు.

చిత్రలేఖన ఉపాధ్యాయుడికి పురస్కారం

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయుడు దోర్నాదుల వెంకటశేషయ్యకు మాదేటి రాజాజీ పురస్కారం దక్కింది. భగీరథి ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో ఆదివారం జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో ఏఎస్పీ మురళీకృష్ణ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు లక్ష్మి చేతుల మీదుగా అవార్డును అందజేశారు.

అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ సభ్యులను నగరంలోని కేపీసీ జూనియర్ కళాశాలలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా అజ్మత్, వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్, కార్యదర్శిగా సమద్, జాయింట్ సెక్రటరీగా శివకుమార్, మహిళా జాయింట్ సెక్రటరీగా మౌనిక ప్రియదర్శిని, కోశాధికారిగా సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దిలీప్‌కుమార్, సభ్యులుగా కొండయ్య, గోపీ నియమితులయ్యారు. ఎన్నిక అధికారులుగా శ్రీనివాసులు, కృష్ణకుమార్ వ్యవహరించారు.

సీపీఐ రూరల్ మహాసభలు



మాట్లాడుతున్న దశరథరామయ్య

నెల్లూరు సిటీ: పేదలకు అండగా సీపీఐ నిలుస్తోందని పార్టీ నేత పముజుల దశరథరామయ్య పేర్కొన్నారు. సాత్‌మోపూరులోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ రూరల్ మహాసభలో ఆయన మాట్లాడారు. జిల్లా మహాసభలను ఆగస్టు రెండు, మూడున నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అబద్ధాలు చెప్తున్నాయని ఆరోపించారు. అనంతరం 21 మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా చిన్న అంకయ్య, సహాయ కార్యదర్శిగా ఆదినారాయణ ఎన్నికయ్యారు. తొలుత పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. నేతలు మాలకొండయ్య, రామరాజు, చేనేత కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు పముజుల హరి, జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్, నందిపోగు రమణయ్య, చల్లా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు (టౌన్): మూలాపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనను శ్రీదేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్సార్ గ్రూప్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, సోదరులు ప్రభాకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి మాట్లాడారు. పీ4 కింద పాఠశాలను దత్తత తీసుకున్నామని, పూర్తి స్థాయిలో వసతులను కల్పిస్తామని తెలిపారు. కమిషనర్ నందన్, డీఎస్సార్ ప్రాజెక్ట్ హెడ్ అనిల్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వరనాయక్, ఎంఈఓ తిరుపాల్, కార్పొరేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను ప్రభుత్వం అమలు చేయాలి


వడ్డెర వృత్తిదారుల సంఘు ఆధ్వర్యంలో ర్యాలీ

నెల్లూరు సిటీ: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘు రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పేర్కొన్నారు. ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘు రాష్ట్ర మహాసభను పురస్కరించుకొని నగరంలోని వీఆర్ కళాశాల నుంచి ఏనుగు సుందర రామిరెడ్డి ఆడిటోరియం వరకు ప్రదర్శనను ఆదివారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. వడ్డెర్ల భద్రతకు సామాజిక రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ భాస్కరయ్య మాట్లాడారు. హామీల సాధన కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చల్లా వెంకటయ్య, భాస్కరయ్య, గుంజి నరసింహారావు, చిన్నయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాస్త్రీయ, జానపద నృత్యోత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో శాస్త్రీయ, జానపద నృత్యోత్సవం, హరివిల్లు ప్రతిభ పురస్కారాల ప్రదానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఇటీవల డాక్టరేట్లు పొందిన రమణారెడ్డి, ఎస్వీఆర్ స్కూల్ కరస్పాండెంట్ అందె శ్రీనివాసులును సత్కరించారు. విశాలాక్షి వృద్ధాశ్రమ నిర్వాహకుడు కోసూరు రత్నం, చిత్రకారుడు అమీర్‌జాన్, నృత్య గురువులు సురభి గాయత్రి, డేగల సాంబశివరావు, జ్యోత్స్న, కట్టోజు శిరీషలతకు హరివిల్లు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. గురుకృప కళాక్షేత్రం, సిద్ధేంద్ర యోగి, నందికేశ్వర కూచిపూడి కళాక్షేత్రాలు, సాయిలలిత నృత్యనికేతన్‌కు చెందిన విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు దోర్నాల హరిబాబు, వేలూరు రంగారావు, నలుబోలు బలరామయ్యనాయుడు, బాబు అగస్టీన్, పేరూరి ప్రదీప్, వాకాటి విజయకుమార్‌రెడ్డి, పాబోలు రామసుబ్బారావు, దేవరాల సుబ్రహ్మణ్యం, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగడి సన్నిధిలో విశేష పూజలు నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో విశేష పూజా కార్యక్రమాలను సోమవారం నిర్వహించనున్నామని ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆండాళ్ అమ్మవారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని రంగనాథుడు, ఆండాళ్ అమ్మవారికి పేట ఉత్సవం, తిరుమంజనం, ప్రాకారోత్సవం, ఎదురుకోలు ఉత్సవం తదితరాలను నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

షుగర్, బీపీ పరీక్షలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 300 మందికి షుగర్, బీపీ పరీక్షలను వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. డాక్టర్ కిరణ్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు స్వర్ణ రమేష్‌బాబు, ట్రెజరర్ గోపీనాథ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, డాక్టర్లు సత్యనాథ్, కృష్ణమూర్తి, పుల్లయ్య, నేతలు సుబ్బరాజు, జయదేవ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్ నుంచి లివర్‌ను కాపాడుకుందాం

నెల్లూరు(అర్బన్): హెపటైటిస్ వైరస్‌ల నుంచి లివర్‌ను కాపాడుకుందామని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఆస్పత్రిలో ఆదివారం ఆయన మాట్లాడారు. నిర్లక్ష్యం వహిస్తే హెపటైటిస్ ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని చెప్పారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీపై కేసును వేదాయపాళెం పోలీసులు ఆదివారం నమోదు చేశారు. వివరాలు.. బుజబుజనెల్లూరులోని బీజేపీ కాలనీలో నివాసం ఉంటున్న విష్ణువర్ధన్ తన యమహా బైక్‌పై జాతీయ రహదారిలోని ఓ కేఫ్‌కు ఈ నెల 14న వెళ్లారు. బయట నిలిపి టీ తాగొచ్చేసరికి వాహనం అదృశ్యమైంది. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.
- ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీకి గురైంది. వివరాలు.. సుందరయ్య కాలనీలోని జాషువానగర్‌కు చెందిన ప్రసాద్ వేదాయపాళెంలోని ఓ బార్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. తన బైక్‌ను ఇంటి ముందు ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం నిలిపారు. భోజనం చేసి బయటకొచ్చేసరికి అదృశ్యమైంది. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువతి అదృశ్యమైన ఘటనపై కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు. వివరాలు.. సుందరయ్య కాలనీకి చెందిన ఓ యువతి నగరంలోని ఓ వైద్యశాలలో నర్సుగా పనిచేస్తున్నారు. ఇంటి నుంచి శుక్రవారం రాత్రి ఆమె అదృశ్యమయ్యారు. జాడ తెలియకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన కార్తీక్ సాయిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గణేశ్ ఉత్సవ సమితి సమావేశం



నెల్లూరు(బృందావనం): సామాజిక చైతన్యానికి వినాయక చవితి ఉత్సవాలు వేదికలని వీహెచ్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. విజయమహల్ గేట్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిట్టి సత్యనాగేశ్వరరావు, సురేంద్రరెడ్డి మాట్లాడారు. ఉత్సవాలను ఆగస్టు 27 నుంచి ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపట్టామని వివరించారు. నిమజ్జనం, శోభాయాత్రను ఆగస్టు 31న నిర్వహించనున్నామని పేర్కొన్నారు. గణేశ్ ఘాట్, రంగనాథస్వామి ఆలయ సమీపంలోని పెన్నానది వద్ద నిమజ్జనం చేయనున్నామన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

ఉత్సవాల నిర్వహణ కోసం నూతన కమిటీని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా సత్యనాగేశ్వరరావు, బయ్యా శ్రీనివాసులు, సలహాదారులుగా సురేంద్రరెడ్డి, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, అధ్యక్షుడిగా కొండపల్లి శ్రీకాంత్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వేలూరు మహేష్, ప్రధాన కార్యదర్శులుగా మండ్ల ఈశ్వరయ్య, భాస్కర్‌రెడ్డి, కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శులుగా యాకసిరి ఫణిరాజు, హర్షవర్ధన్, సంఘటన కార్యదర్శులుగా మల్లికార్జునరెడ్డి, నాగశ్రీనివాసులు, మహేష్, కోశాధికారిగా చింతాల మల్లిక తదితరులను నియమించారు.

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం


తహసీల్దార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఆచారివీధిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు అర్బన్ తహసీల్దార్ షఫీ హాజరయ్యారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి ఎలాంటి సమస్యలొచ్చినా పరిష్కారానికి చర్యలు చేపడతామని వివరించారు. అనంతరం తహసీల్దార్‌ను సన్మానించారు. ఈ నెల్లో జన్మదినాన్ని జరుపుకొంటున్న వారిని సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దేపల్లి సుబ్బారావు, కృష్ణయ్య, ఆడిటర్ సత్యనారాయణగుప్తా, అనుమాలశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాకిరణాలకు ప్రతిభ పురస్కారాలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గిరిజన విద్యాకిరణాలకు పాట్లూరి సత్యరత్నం ప్రతిభ పురస్కారాలను నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో గిరిజన విద్యా చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పులి చెంచయ్య ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. పదో తరగతిలో 450.. ఇంటర్‌లో 850 మార్కులకుపైగా సాధించిన 130 మంది విద్యార్థులకు నగదు, ప్రతిభ పురస్కారాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ముఖ్యఅతిథులుగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మేయర్ స్రవంతి హాజరయ్యారు. ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ యాకసిరి వెంకటేశ్వర్లు, హైకోర్టు అడ్వొకేట్ మల్లికార్జునరావు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు దాసరి పోలయ్య, గిరిజన విద్యా చైతన్య వేదిక రాష్ట్ర నేత కొమరగిరి దయాకర్, కార్పొరేషన్ బ్యాంక్ మాజీ ఉద్యోగి వేటగిరి సుధాకర్, యాకసిరి లోక్‌సాయి, ఏకుల నాగార్జున, పాట్లూరు మోహన్, బాలాజీ, మానికల జయలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మహాకుంభాభిషేకం



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని బంగ్లాతోటలో కొలువైన విజయగణపతిస్వామి దేవస్థానంలో మహాకుంభాభిషేక మహోత్సవాన్ని వేడుకగా ఆదివారం నిర్వహించారు. మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి హాజరై స్వామి వారి ఆశీస్సులను అందుకున్నారు. వైవీ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, హరిబాబుయాదవ్, ఏసునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, చేజర్ల మండల మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, మొయినుద్దీన్, కొండేటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.